కాని ఆదాకా రానిచ్చి, గొంతుక పట్టేసినట్టయి యేడుస్తాడు విల విలా! మిండగాడేకానియ్యండి! కొండడు!

వానికి సాధ్యంకాని ప్రకటింపు మనకెందుకంటారా? పోనియ్యండి! వాణ్ణి వోపిచ్చివానిలా పోనియ్యండి! గాఢాంధకారములో అలా!

.... .... .... .... ....

## కేరమ్సు - బిలియర్డ్సు

ఇరుకుసందులూ, కుళ్లగళ్ళీలు, వంకర టింకర గొందులూ, నడవడానికీ మన నంచెయ్యడానికీ, వీలుగా వుంటాయని ఎవ్వరూ అనరు కాని గోవర్ధనుడు తాటిచెట్టు మొవ్వులోకెక్కి కూర్చున్నట్టయిపోతాడు వాటి మాటెత్తితే. అతడు ప్రతిపాదిస్తాడోసంగతి. ఏమనీ అందమయిన ఆడవాళ్ళు మెఱుపులల్లే మెఱిసేది సందుల్లోనూ గొందుల్లోనూ గళ్ళీల్లోనే అని: గట్టిగా కారణం అడిగితే అది తన అనుభవం అంటాడు ఇకదానికి జవాబు చెప్పడం ఎవరి తరమూకాదు—కాని ఆ ప్రతిపాదనం గనక రెండుమూడుమాట్లు వితర్కించి మరొక మగవాడెవడయినా యోజిస్తే వాడికి అలాగే తట్టుతుందేమో అని నాయూహ.

చూడండీ! సందులూ గొందులూ వేటివల్ల యేర్పాటు అవుతవి? ఇంటిమీదఇల్లు—ఇంటివెనకఇల్లు—ఇంటిముందుఇల్లు—అడ్డంతిరిగిన వేరులాగు పాకిపోవడం వల్లకదా—మఱి ఇళ్ళల్లో ఉండేవాళ్ళెవరంటారు? ఆడవాళ్ళకదా—ఆడవాళ్లు ఎప్పుడూ

అందమయినవాళ్ళే కదా—అందులోకీ వాళ్ళు ఆ సందుల్లో మరీ దగ్గరగా మీదబడ్డట్టు నడవడమో, నించోడమో, లేకపోతే కిటికీల్లోంచి గుమ్మాల్లోంచి చూడ్డమో చేస్తుంటే, గోవర్ధనుడు బోటి గాడు సోలైపోవడంలో వింతేముంది? ఇంతకూ చూచింది ఒక సంగతి ఏదో అయియుంటుంది. దాన్నిబట్టి ఇక సందుగొందులకు ఎక్కడలేని చక్కదనం, పన్నీరుచలవ, అత్తరు పరిమళ్, కళాకాంతి, ప్రేమాప్రణయమ్, ఎన్ని సూత్రించాలో అన్నీ సూత్రించేసేడేమోకూడా, ఆ మొనగాడందుకు తగ్గవాడే.

అయినా కర్మసాక్షిలాగు పరీక్షించి చూద్దాం—అతగాడి వాక్కు ఎంతమట్టుకు నిజమో ఒకర్నిచూచి అంటున్నాడో ఆ వాక్యం పదిమందినీ చూచి అంటున్నాడో—

గోవర్ధనుడు నడుస్తూనడుస్తూ "పిళ్ళారిశెట్టిగళ్ళీ" లో ఒక గుమ్మంమెట్టు స్వేచ్ఛగా ఎక్కుతున్నాడు. అప్పటికప్పుడే గుమ్మంలో ఓ మాత్రం వలమయిన వనిత ఓ తట్టు ద్వారబంధం మీదికి తన ఎడంభుజం మెత్తంది, నున్నంది, నిగనిగలాడేది ఆనించుకు నించుంది. ఆమె వెనుకనుంచి మఱో ఎమ్మెలాడి ఆమెకంటె కొంచెం ఎత్తరి, కాని సన్నపాటినడుం, సన్నపాటి మెడ, సన్నపాటిచేతులూ, తక్కినవిస్ఫుటంగా కనబడ్డానికి ఏర్పాటు అయ్యాయో అన్నట్టు కనిపిస్తూ, తొంగిచూస్తుంది. గోవర్ధనుడు గుమ్మంమెట్టెక్కడం చూస్తూంటే ఆ యిద్దరికీ చిరునవ్వు వచ్చింది. పొడగరిది చిరునవ్వుతో ఆగక "వచ్చావు! నీవురావేమో అనుకున్నాం. వచ్చావు! మేం సిద్ధంగానే వున్నాం" అంది.

ఈ దిక్కుమాలినసందులో కాపురం పెట్టారేమిటి? "కా" రిల్లారాదామె చూడండీ" అన్నాడు గోవర్ధనుడు.

" దీన్ని దిక్కుమాల్ని సందు అనేవాడిబుఱ్ఱ మరొక్కడిదయితే యీ పాటికి వెయ్యివక్కలు అయిపోను, నీదికాబట్టి నిల్చివుంది. ఇంకెప్పుడూ అలాఅనకు, ఇది చాలా పవిత్రస్థలము " అంది. " ఉండవే మీదపడకు " అని వెనకాలిపడుచును నెట్టుతూ స్థూల సుందరి ఆ మాటకు లేదమలపాకులాంటి పలాచిటిది చిరాకు పడ్డదై లోపలకు వెళ్ళి గదిలో " కేరమ్సు " బల్లదగ్గర చతికిలి బడి టక్‌టక్ రెండుమూడుసార్లు కాయల్నికొట్టింది, సంచీలో పడేటట్టు.

ఓ మీయింటికీ మూలసందులోకీ వచ్చింది ? ఈ అమ్మ వారు కోర్లమ్మవారు ? అయితే ఇది అప్-టు-డేట్ సందే—ఏది ఒక ఆటఆడి మరీపోదాం. నడువు లోపలికి. నాకు ఎడమియ్యవే, పోనీ అంటూ చొరుచుకు పొయ్యేడు ఎదురున్నవాళ్ళ చనువును బట్టి గోవర్ధనుడు. " థిక్‌లేడీ " అతగాడి సీలమండలు గమనిస్తూ " బాడిగా వున్నయి. కాళ్ళు కడుక్కుని మరీగదిలో ప్రవేశించు " అంది. " ఏదీ పినైలు వాటరు ? " అన్నాడు గోవర్ధనుడు. " డాక్టరివైతే మరీ ఆక్షేపిస్తువు మమ్మల్నీ మా సందుల్నీ— అదిగో ఆ కుళాయిదగ్గర కడుక్కుని ఆ టర్కిష్ తువాలుపెట్టి తుడుచుకొనిరా ! త్వరగారా మేం ఆడుతూవుంటాం రా ! " అంది.

గోవర్ధనుడు కొంచెం కాళ్ళు కడుక్కొని వెళ్ళడంలో ఆలస్యమయింది. అప్పటికప్పుడే ఇరువురు యువతులూ మంచి రసకంధాయి పట్టుగా—దేంద్రవాడు కండె విసరినప్పటికంటె ఎక్కువ తడతడ చప్పుడయ్యేటట్టు-ఆడేస్తున్నారు. కేరమ్సు ఆట-బొద్దుగున్న ముద్దుగుమ్మ వీపుమీద అని గోవర్ధనుడు ఆట చూస్తూ అన్నాడు " ఈ వీపు బిలియర్డ్సు బల్లలాగుంది " అని.

ఎదరఆడే—చక్కంది చిక్కినా అనే సామెతకొచ్చే—కోకిలవాణి వంచి ఆడుతూవున్న తల వంచినట్లేవుంచి ఏం నా "ఐబాల్సు "కి నీ చూపుకోలలా వీపుమీదుగా తగులుద్దామనే దానివీపు బిలియర్డ్సు బల్ల చేస్తున్నావు. నేను ఆటలో నిమగ్నురాలనై యున్నాను నీకేసి చూడను " అంది.

". అయితే నేను క్లబ్బుకుపోయి నిజం బిలియర్డ్సు ఆడు కుంటాను " అన్నాడు గోవర్ధనుడు. " ఎవరితోటి ? " అంది. అందాకా అతడికేసి చూణ్ణు అన్న టెక్కులాడి పోకమొక్కసోన అతనికేసిచూస్తూ " నీవువస్తే నీతోటే " అన్నాడు గోవర్ధనుడు. " మీ క్లబ్బులోకి ఆడవాళ్ళను రానిస్తారా ? " అంది వీపుమీద బరువు విదలించుకుంటూ వెనక్కుచూచి పుష్టిదేహయష్టి. " ఒక మగవాడు " మెంబరు " అయితే " ఆటోమాటిక్ " గా వాని భార్యాకూడా మా క్లబ్బులో మెంబరే—అర్ధనారీశ్వరక్లబ్బు మాది" అన్నాడు గోవర్ధనుడు. " నీవు బాచలుర్ వే " అంది పందల పాక నూలుమనిషి. " ఒకస్త్రీతో ఒకడు క్లబ్బుకు వస్తే ఆమె " వాని భార్య అని అనుకోవలసినదే " అన్నాడు గోవర్ధనుడు. " ఓ! ఏనాం పెళ్ళిళ్ళకంటె చవగ్గా అయిపోతాయే మీక్లబ్బులో పెళ్ళిళ్ళు. అయితే నీవు వెళ్ళే " అంది నెంబరు ఒకటి—లావు పాటి లలనామణిని ఈ పైని నెంబరు ఒకటి అందాం. ఆమె ఒకటోనెంబరయితే తదితరస్త్రీ రెండోనెంబరు దానంతటదే అవుతుంది. రెండోనెంబరుది అంది. " నాకు ఏనాంపెళ్ళి ఖర్మ మేం ? పదహారేళ్లున్నాయినాకు " అని.

" అయితే మీ యిద్దరిలో నీకు పెళ్ళి అయిందన్నమాటే? నీవు కూడా కన్యవే అనుకుంటున్నాను. " అన్నాడు గోవర్ధనుడు.

పిప్పళ్ళబస్తాలాంటి శాంతమ్మకు కళ్ళమ్మటనీళ్లు గిర్రునతిరిగి ముఖంలో కళతగ్గిపోయింది ఆ ప్రశ్నతో. తాంబ్రాతీగిలాంటి చారుశీల తనతోటి స్త్రీయొక్క ముఖంలో ఆ మార్పు చూట్టం తోటే అదోమోస్తరు ఇదొచ్చి మూకీభావం వహించింది.

గోవర్ధనుడు సంగతికనిపెట్టి అన్నాడు "జీవితం ఎప్పుడూ ఓలాగుండదు. ఒకప్పుడు పెళ్ళిఅయినవాణ్ణే నేనూను. ఇప్పుడు "విడోవర్ని" అలాఅని ఏడుస్తానా? ఇలాంటి అసందర్భాలు వెళ్ళకక్కించి దుఃఖవారాసిలో ముంచాలిసివస్తుందనే క్లబ్బుల్లో సంసారాల్నిగురించి సంప్రతించుకోరు. ఆల్‌జాలీ ఎవర్‌జాలీ! బిలియర్డ్సు టేబిల్ మీద ఫూల్‌బాల్సు ఇంద్రధనుసు వన్నెలతో దొర్లుతూవుంటే చూస్తూ ఆగినతోడనే పొడుగుపాటికర్రతో ఆలా ఒకకాలు టేబిల్‌అంచునే ఆన్చి టకీమని కొట్టడంలో ఎన్ని కష్టాలన్నా మరచిపోవచ్చు" అన్నాడు గోవర్ధనుడు.

శాంతమ్మకు కొంచెం మనశ్శాంతి కలిగింది. ఆ పలుకుతో ఒక విధమయిన కులుకు పుట్టింది: కన్నీటిచుక్క దావంతటదే వేడిపెనమీద అట్లపిండి తొలివిదులుపులాగు చుంయిమని ఇగుర్చుకు పోయింది. "బిలియర్డ్సుటేబిల్ ఇక్కడకు తెప్పించు ఆడతాను" అంది శాంతమ్మ—"కారేరానప్పుడు బిలియర్డ్సు టేబిల్ వస్తుందా ఈ యిరుకుసందులోకి? మీయింట్లో ఎక్కడ పెట్టడానికి చోటుందీ? మనహృదయాలంటే విశాలహృదయాలు కావచ్చును కాని, మనయిళ్ళూ, వాకిళ్ళూ, ఊళ్ళూ, సంఘాలూ, చట్టాలు విశాలవంతాలు కావు. శాంతా! రావాలంటే నాతోరా. మళ్ళానిన్ను పువ్వులలోపెట్టి తీసికొనివచ్చినట్టు తీసుకొనివచ్చి మీ యింటిదగ్గర దిగబెడతా" అన్నాడు గోవర్ధనుడు. "నాకు

బిలియర్డ్సు ఆడ్డంచేతగాదు. కేరమ్సుఏగాని—అంది శాంతమ్మ నవ్వుతూ. "అందుకే నిన్ను రమ్మంటూన్నది. నేర్పుతాగా బ్రహ్మవిద్యగాదు అదీ ఇలాంటిఆటే. ఎత్తుబల్ల వ్రేలాడే చిక్కాలు—కాని ఇక్కడవేళ్ళతో బిళ్ళలుకొడతారు, అక్కడ కర్రలతో బంతుల్ని పొడుస్తారు. ఒకటి మాత్రం గమనించాలి అక్కడ—గుడ్డచిరక్కుండా కొట్టాలి" అన్నాడు గోవర్ధనుడు.

"ఆడవాళ్ళం మాకేం తెలీదు, ఈ సందుగొందుల్లో ఇరకాటంలోపారేసి ఎడ్వాన్సుడువ్యూస్ లేకుండాచేశారుకదా మీరు మగవాళ్లు-" అంది చారుశీల. అయితేం బ్యూటీఅంతా మీదే" అంటూ గోవర్ధనుడు శాంతమ్మను సందుచివరదాకా నడిపించుకుంటూవెళ్ళి కారెక్కించుకు అర్ధనారీశ్వర క్లబ్బు"కు తీసుకువెళ్ళినాడు.

చారుశీల వాళ్ళిద్దరూ వెడుతూంటే కొంతసేపు అదోలీలగా చూచింది కాని తననురమ్మనక శాంతమ్మను తీసుకొనివెళ్ళడంలో గోవర్ధనంగాడి ఉద్దేశ్యం గ్రహించే తికమకలో ఒళ్ళుతిరిగినట్టయిపోయి తలుపేసుకుంది. తిన్నగా స్ట్రియికరుపుచ్చుకొని క్వీన్నుకు కారమ్సు టేబిల్‌మీద ఒకరిప్లెక్షన్‌స్ట్రోకిచ్చి కసిగాచూస్తూ "అందంఅంతా ఆడదాంచే అంటాడు ప్రతీమగాడూ—కాని పెళ్ళాడ్డం దగ్గరకు వచ్చేసరికి ఏ ఆడదాన్నిపడితే ఆ ఆడదాన్ని పెళ్ళాడ్డు అక్కడమళ్ళీ కేటాయింపు. వెధవమగవాళ్ళూ వెధవ కబుర్లూను." అంటూ అద్దమ్ముందుకుపోయి తనముఖం, కంఠం, బాహూర్వాపాదమస్తకం చూచుకుంటూ విమర్శించుకొంటూంది. "ఆ గాడిదంటూ వచ్చేదేకాని ఎఱ్ఱటిపెదవినాదని—ఎరుపేలేదు నా పెదవికి" అని జేబురుమాలుపెట్టి ఊ తుడుచుకొంటూంది.

" ఇంద్రధనుసూ రంగులన్నీ - ఎందుకల్లా తుడిచివేస్తవు?
చెమటలోస్తూ ఉన్ననీవు - అమలకోమల వోసుగాత్రీ!"

అంటూ సందేహోతూ కిటికీగుండా చారుశీలని చూచిన ఒకనవయువకుడు పాడుకొన్నాడు. వెంటనే చారుశీల "ఈసందుగొందుల్లోంచి కాపురం ఎత్తెయ్యాలి. ప్రతీమగవాడికీ ఇదో మార్గం అయిపోయింది. వాడు స్టుపిడ్ పురుషోత్తంలాగున్నాడు. అయినా ఎవర్నిచూచి పాడేడో—పిల్చికనుక్కుంటా" అని వీధిలోకివెళ్ళి పురుషోత్తం! వెధవా! యిలారావోయి! ఎవర్నిచూచి ఆపాట" అంది. కష్టపడే కూలిపడుచునిచూచి కేరమ్సు-బిలియర్డ్సు ఆడే నవనాగరీకుల్ని చూచికాదు" అన్నాడు. "వాళ్లు ఆకర్షిస్తారా మగవాళ్ళని?" అంది చారుశీల. ఓ వండర్ఫుల్లీ! మోస్టు వండర్ఫుల్లీ వాళ్ళు శుభ్రంగా ఆరుబయట పొలాల్లో కనబడతారు. మేఘాలుపైని సర్పాల్లాగ ఆడుతూంటే కింద ఆనీడకింద పాటపాడుతూ ఆకర్షిస్తారు" అన్నాడు పురుషోత్తం.

"మగవాళ్ళు పందులు కుక్కలు ఆంబోతులు" అంది చారుశీల. "ఏం? అంతకోపంగావుంది వాళ్ళంటే నీకీవేళ?" అన్నాడు పురుషోత్తం. "కూలిపడుచులు నల్లగావుంటారు. మకిలిగుడ్డలు కట్టుకుంటారు. నీచు తింటారు. వాళ్ళను అప్సరసలంటూ పొగిడేస్తున్నావు. నీవు మొగాడివే పందివి కుక్కవు ఆంబోతువు కాకపోతె ఏమనుకోను?" అంది చారుశీల. "వాళ్లు పీల్చేగాలి యీ కుళ్లనీళ్ళమీద గాలికంటె మంచిగాలి పీలుస్తారు. వాళ్లుతాగే నీళ్లు వాననీళ్ళే అనుకో చాతకాల్లాగనుకో—నీకేదో వెట్టెత్తింది." అన్నాడు పురుషోత్తం "గోవర్ధనం విడోవరా?"

అంది చారుశీల. అవును అన్నాడు పురుషోత్తం, అయితేనేం వాణ్ణి పెళ్ళాడింది శాంతమ్మ.

ఇది "విడో కాబోలు" అన్నాడు కూడాను. "నీ కెలా తెలిసింది అప్పుడే" అంది చారుశీల. "వాళ్ళిద్దరూ క్లబ్బులో బిలియర్డ్సు ఆడుతూవుంటే అంతా అనుకొన్నారు విడోఆటఅని" అన్నాడు పురుషోత్తం. నీవు క్లబ్బులో మెంబరివేనా ? అంది చారుశీల. కాని వాడెవడూ ? అన్నాడు పురుషోత్తం. "నీదే ఆట ? అంది చారుశీల. "నాది కేరమ్సు ఫస్టుహ్యాండు పునిస్త్రీ ఆట. అనాఘ్రాతం—" అన్నాడు పురుషోత్తం. "నీవు పుల్లింగం గాడివే" అంది చారుశీల. "ఓ అదా నీ సందేహం మా క్లబ్బులో ఆడామగా వివక్షత ఆటలకేకాని మనుష్యులకు వర్తించదు. విడోఆటఅంటే బిలియర్డ్సు బాల్సు మన్నటిగుళ్ళ లాగుంటాయి చూడు వాటితో ఆడతారు. అది విడోఆట. కేరమ్సు ఆటలో కుంకుంబొట్టులాగు రాణీకాయవుంటుంది. చూడు ఎఱ్ఱగా—దాన్నిబట్టి పునిస్త్రీ ఆట అంటారుదాన్ని అన్నాడు పురుషోత్తం. "నా యుద్దేశ్యంలో మీ క్లబ్బులు కూడా సందు గొందులుకంటే కుళ్లు గళ్ళీలకంటే అసహ్యకరమైన కూపాలను కుంటాను" అంది చారుశీల. "అందుకే ఆరుబయట మేఘాల కింద అన్నాను" అన్నాడు పురుషోత్తం.

మరి గోవర్ధనుడూ శాంతమ్మా ఇంటికివచ్చేసరికి ఇంట్లో లేదు చారుశీల. గోవర్ధనుడికి రాత్రీస్వేచ్ఛే పగలూస్వేచ్ఛే. అతగాడికాసందుపొందే స్వర్గతుల్యం అయిపోయింది. తాటిచెట్టు మొవ్వులోకెక్కిపోడూమరీ సందన్నా గళ్ళీఅన్నా గొందిఅన్నా గోవర్ధనుడు ?

.... .... .... .... ....